తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట

జోగులాంబ గద్వాల

వనపర్తి | నారాయణపేట

నాగర్ కర్నూల్

మంగళవారం

10 నవంబర్ 2026

తల్పునూర్ జడ్పీహెచ్ఎస్ - చదువు కంటే ప్రాణాలకే ముప్పు ఎక్కువ!

- టాయిలెట్లు లేవు.. తాగడానికి నీళ్లు లేవు.
- మూత లేని సంపు.. కూలిపోతున్న భవనాలు..
- ఇది పాఠశాలా ? లేక ప్రమాదాల పుట్టా?



రేవల్లి, నవంబర్ 8 (జనంసాక్షి):

ఒక పాఠశాల అంటే పిల్లలు భయం లేకుండా చదువుకోవాలి. కానీ రేవల్లి మండలం తల్పునూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్తే పరిస్థితి దానికి పూర్తి భిన్నంగా ఉంది. ఇక్కడ అడుగడుగునా ప్రమాదమే. టాయిలెట్ కు వెళ్లాలన్నా భయం, నీళ్లు తాగాలన్నా భయం, ఆడుకోవాలన్నా భయం. పిల్లల చదువు కంటే వారి ప్రాణాలకే ఎక్కువ ముప్పు ఉన్న బడిగా ఈ పాఠశాల మారిపోయింది.

ఏడాదైనా పూర్తి కాని టాయిలెట్లు...



టాయిలెట్ల నిర్మాణం చేపట్టి సంవత్సరం పూర్తి అవుతున్నా ఇప్పటికీ పూర్తి కాలేదు. టైల్స్ వేశారు, కమోడ్ లు పెట్టారు, కానీ ట్యాప్ లు బిగించలేదు, నీటి సౌకర్యం కల్పించలేదు. లోపల దుమ్ము, ధూళి, చెత్తతో టాయిలెట్లు వాడుకోడానికి పనికిరాకుండా పోయాయి. విద్యార్థులు మూత్రశాలలకు వెళ్లాలంటే ఆరు బయటకు వెళ్లక తప్పదం లేదు. పాఠశాలలో చదువుతున్న బాలురు గ్రామంలో గల ఓ మందిరం ముందు ఉన్న డ్రైనేజీ దగ్గరికి వెళ్లక తప్పదం లేదు. పైపులైన్లు కూడా అసంపూర్తిగానే వదిలేశారు. బయట నేలపై పైపులు అలాగే పడి ఉన్నాయి. అసంపూర్తిగా వదిలేసిన పైపులైన్ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. బాలికల కోసం ఏర్పాటు చేసిన ఇన్సినరేటర్ మెషిన్ కూడా నీళ్లు, కరెంట్ లేక నిరుపయోగంగా మారింది. దీంతో విద్యార్థులు, ముఖ్యంగా బాలికలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

రూమ్ ఉంది.. ఫిల్టర్ ఉంది.. కానీ నీళ్లు లేవు!



పాఠశాలలో త్రాగునీటి సమస్య తీవ్ర స్థాయిలో ఉంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) వారు సిఎస్ఆర్ నిధులతో ఫిల్టర్ వాటర్ కోసం ప్రత్యేక రూమ్ ఏర్పాటు చేశారు. బోర్డు కూడా పెట్టారు. కానీ పాఠశాలకు నీటి వసతి లేకపోవడంతో ఆ ఫిల్టర్ అందుబాటులోకి రాలేదు. పిల్లలు దాహంతో అల్లాడుతున్నా, మంచినీళ్ల కోసం బయటకు వెళ్లాల్సిన పరిస్థితి. పాఠశాలకు నీటి వసతి కల్పిస్తే ఈ సమస్యన్నీ తీరిపోతాయని తల్లిదండ్రులు చెబుతున్నారు.

మూత లేని సంపు - మృత్యు గుంత

ఈ పాఠశాలలో అత్యంత ప్రమాదకరమైనది నీటి సంపు. నీటి వసతి కోసం సంపు ఏర్పాటు చేసి అసంపూర్తిగా వదిలేశారు. సంపు పైన మూత సెట్ చేయలేదు. మూత లేని సంపులో చేరిన వర్షం నీరు, చెత్త. మూత లేకపోవడంతో వర్షం నీరు, చెత్తా చెదారం, ఆకులు అన్నీ సంపులోకి చేరి నీరు నల్లగా,



విషపూరితంగా తయారైంది. ఆడుకునే పిల్లలు పొరపాటున అందులో పడితే ప్రాణాలకే ప్రమాదం.

కూలిపోతున్న శిథిల భవనాలు



నూతన పాఠశాల భవనం ముందు శిథిలావస్థలో ఉన్న రెండు పాత భవనాలను ఇప్పటికీ తొలగించ లేదు. ఎప్పుడు కూలిపోతాయో తెలియని స్థితిలో ఉన్న ఆ భవనాలు విద్యార్థులకు ప్రాణహానిగా మారాయి. శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చేందుకు పలుమార్లు ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్లు పాఠశాల ఉపాధ్యాయురాలు అలివేలు తెలిపారు. వెంటనే పాఠశాలకు నీటి సౌకర్యం కల్పించి, టాయిలెట్ల నిర్మాణం పూర్తి చేసి, సంపుకు మూత ఏర్పాటు చేసి, శిథిల భవనాలను తొలగించాలని గ్రామస్తులు, తల్లిదండ్రులు, విద్యార్థులు అధికారులను కోరుతున్నారు. లేదంటే ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు.

ఓ వైపు నీటి పొదుపుపై ప్రభుత్వ ప్రచారం.. మరోవైపు నిమ్జ్ పానుల పేరిట నీటి వృధా!

- రోజూ 8 కిలోమీటర్ల మేర రహదారిపై ట్యాంకర్లతో నీటి చల్లకం..పట్టించుకోని అధికారులు



ఝరాసంగం,నవంబర్9(జనంసాక్షి): ఒక పక్క ఎల్నినో ప్రభావంతో వర్షాలు అంతంత మాత్రమే కురియడంతో ఈ సంవత్సరం నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ప్రభుత్వం ప్రతి నిత్యం చెబుతుంటే మరో పక్క అవేమి పట్టనట్లు నిమ్జ్ పేరుతో నీటిని వృధాగా రోడ్డుపై పోస్తున్నారు. జహీరాబాద్ ప్రాంతంలో ఉన్న జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలిలో స్మార్ట్సిటీ ఏర్పాటు చేయడానికి మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం టెండర్లు పిలువగా ఎస్ఆర్ఆర్ సంస్థ టెండర్లు దక్కించుకున్నది. *మిగతా 4లో..*

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ నర్సింగరావు



గద్వాల నడిగడ్డ, నవంబర్ 9 (జనంసాక్షి); ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. సోమవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. *మిగతా 4లో..*

ప్రజావాణికి చిన్నారుల అప్లికేషన్.. స్కూల్ గ్రౌండ్ శుభ్రం చేయాలని వినతి



రేవల్లి, నవంబర్ 09 (జనంసాక్షి):

ప్రజావాణి అంటే పెద్దలకే కాదు, చిన్న పిల్లలకు కూడా తెలుసు అని నిరూపించారు. రేవల్లి మండల చిన్నారులు. తమ పాఠశాల ఆవరణలో, గ్రౌండ్‌లో పేరుకు పోయిన చెత్త, ముళ్ళపొదలు, మురికి వల్ల ఆడుకోవడానికి, చదువుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తమ స్కూల్ గ్రౌండ్ ను శుభ్రం చేయించాలని కోరుతూ చిన్నారులు ప్రజావాణిలో అప్లికేషన్ ఇచ్చారు.

తమ బడి బాగుండాలని, గ్రౌండ్ శుభ్రంగా ఉండాలని చిన్నారులు స్వయంగా ముందుకు వచ్చి అప్లికేషన్ ఇవ్వడం అందరినీ ఆకట్టుకుంది. “మా బడి, మా గ్రౌండ్ శుభ్రంగా ఉండాలి, మేము హాయిగా ఆడుకోవాలి” అని చిన్నారులు తమ అప్లికేషన్ లో కోరారు.

ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమంపై చిన్నారులకు కూడా అవగాహన ఉండటం పట్ల గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. చిన్నారుల వినతిపై అధికారులు వెంటనే స్పందించి స్కూల్ గ్రౌండ్ శుభ్రం చేయించాలని తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ఎల్‌నినో ముప్పు.. పంటల మార్పిడే మేలు

- నీటి లభ్యతకు అనుగుణంగా సాగు చేయాలి.. పశుపోషణతో అదనపు ఆదాయం
- మెదక్ తాగునీటి అవసరాలకు సింగూరు జలాల వినియోగానికి ప్రాధాన్యం
- రాంచంద్రాపూర్‌లో పశుసంవర్ధక శిబిరంలో మంత్రి వివేక్ వెంకటస్వామి



నర్సాపూర్, నవంబర్ 9 (జనంసాక్షి):

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి భూగర్భ జలమట్టాలు పడిపోతున్న నేపథ్యంలో రైతులు పంటల మార్పిడిపై దృష్టి సారించాలని రాష్ట్ర శక్తి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సూచించారు. నీటి లభ్యతను బట్టి పంటలు సాగు చేయాలని, వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీరు అవసరమయ్యే పంటలను ఎంచుకోవాలని కోరారు. వ్యవసాయానికి అనుబంధంగా పశుపోషణ చేపట్టి అదనపు ఆదాయం పొందాలని సూచించారు.

నర్సాపూర్ మండలం రాంచంద్రాపూర్‌లో సోమవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమగ్ర పశుసంవర్ధక శిబిరంలో మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు, ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డితో కలిసి మంత్రి పాల్గొన్నారు. పశువులు, గొర్రెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

రాష్ట్రంలో భూగర్భ జలమట్టాలు సుమారు మూడు మీటర్లు పడిపోయాయని, రానున్న రోజుల్లో నీటి కొరత మరింత పెరిగే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్రంలో 35 లక్షల బోర్‌వెల్స్ ఉండగా, విద్యుత్ వినియోగం కూడా అధికంగా ఉందని తెలిపారు. రైతులు నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని, ఇప్పటి నుంచే పంటల మార్పిడి చేపట్టక పోతే యాసంగిలో నష్టాలు తప్పవని హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లేందుకు అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామని చెప్పారు.

ప్రాణహిత ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు అవసరమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటి పంపింగ్‌పై సాంకేతిక పరిశీలనల అనంతరమే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

మెదక్ జిల్లా తాగునీటి అవసరాలకు సింగూరు జలాల వినియోగానికి ప్రాధాన్యం ఇస్తామని, ఈ విషయంపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

ఎంపీ రఘునందన్‌రావు పశుసంపద పెంపునకు కేంద్రం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పశువులకు బీమా, ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతిమా సింగ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా బాణాసంచా దుకాణాలు.. అధికారులకు పట్టదా?

- జనావాసాల మధ్యే పది మందికి పైగా వ్యాపారుల దుకాణాలు
- నిబంధనలు ఉల్లంఘిస్తున్నా చర్యలు శూన్యం
- ప్రమాదం జరిగితే బాధ్యులెవరు?

అచ్చంపేట, నవంబర్ 8 (జనంసాక్షి):
దీపావళి సందర్భంగా బాణాసంచా దుకాణాలను జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాల్సి ఉండగా, అచ్చంపేటలో మాత్రం నిబంధనలకు విరుద్ధంగా రద్దీ ప్రాంతంలో దుకాణాలు ఏర్పాటు చేయడం ఆందోళన కలిగిస్తోంది. లింగాల చౌరస్తా సమీపంలోని ఓ ప్రైవేటు స్థలంలో పది మందికి పైగా వ్యాపారులు బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



ప్రమాదాలకు నిలయంగా మారే అవకాశం...
ప్రస్తుతం దుకాణాలు ఏర్పాటు చేసిన ప్రాంతం నిత్యం జనసంచారంతో రద్దీగా ఉంటుంది. రైస్ మిల్లు ఆవరణలో ఉన్న ఈ దుకాణాలకు సమీపంలోనే భారీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే మంటలు ట్రాన్స్‌ఫార్మర్‌కు, రైస్ మిల్లుకు వ్యాపించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా సమీపంలో ఐదు వరకు ప్రైవేటు ఆసుపత్రులు ఉండటంతో ప్రమాదం జరిగితే రోగులు, ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది.

అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు...
అచ్చంపేటలో బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు ఎన్టీఆర్ స్టేడియం, వ్యవసాయ మార్కెట్ పరిసరాల్లో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని వినియోగించకుండా రద్దీ ప్రాంతంలో దుకాణాలు ఏర్పాటు చేయడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దుకాణాల ఏర్పాటును ముందుగానే గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ, అగ్నిమాపక, పోలీసు శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దుకాణాల ఏర్పాటుకు వారం రోజుల ముందే నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. చివరి నిమిషంలో తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన దుకాణాలపై విచారణ జరిపి, జనావాసాలకు దూరంగా సురక్షిత ప్రాంతాల్లో బాణాసంచా విక్రయాలకు ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో బీఆర్ఎస్ సర్పంచులకు ప్రాధాన్యత ఇవ్వాలి

- ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేత



రాయికోడ్, నవంబర్ 9 (జనంసాక్షి): ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత లబ్ధిదారుల ఎంపికలో బీఆర్ఎస్ సర్పంచులకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ఆయా గ్రామాల సర్పంచులు కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో తహసీల్దార్ ఆశాజ్యోతి, ఎంపీవో శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ అధికార పార్టీ గ్రామాల్లోనే అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక కొనసాగుతోందని, ప్రతిపక్ష సర్పంచుల గ్రామాలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆరోపించారు. లబ్ధిదారుల ఎంపికలో తమకు కూడా భాగస్వామ్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయికోడ్ సర్పంచ్ రాధా తుకారం, నవనీత విష్ణువర్ధన్ రెడ్డి, ఎర్రోళ్ల ప్రవీణ్ కుమార్, రాజు, లక్ష్మి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి సంబరాలు



రాయికోడు, నవంబర్ 9 (జనంసాక్షి):
మండల కేంద్రమైన రాయికోడు తోపాటు మండల పరిధిలోని పీపడ్పల్లి, అల్లాపూర్, నాగ్వార్, సింగీతం, తదితర గ్రామాలలో ఆదివారం దీపావళి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా టపాకాయలు పేల్చి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ సిద్దన్న పాటిల్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కేదార్నాథ్ పాటిల్, మాజీ అధ్యక్షులు బాలాజీ నర్సింలు, బసవరాజు పాటిల్, వీరభద్రేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వినయ్ కుమార్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు శాంత కుమార్, మహంకాళి, బస్సులింగ్, సంజీవ్, సుభాష్, ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్‌లో ఘనంగా 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి'

- అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు: హాజీ పటేల్



సంగారెడ్డి, నవంబర్ 9 (జనంసాక్షి):
మండల పరిధిలోని సైదాపూర్‌లో సోమవారం 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లకు దీపావళి స్టిక్కర్లు అతికించి, మిఠాయిలు పంపిణీ చేశారు. టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు హాజీ పటేల్ మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యం ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చడమేనన్నారు. నిర్మల, జగ్గారెడ్డిల సహకారంతో అర్హులకు ఇళ్లు మంజూరు చేయించామని తెలిపారు. ఇంకా అర్హులైన వారు ఉంటే పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్ కుమార్, పాషా, పంచాయతీ కార్యదర్శి సంపత్ కుమార్, ఏఈఓ రవి పాల్గొన్నారు.

తెలంగాణ పునర్నిర్మాణంలో సీఎం రేవంత్ రెడ్డి పాత్ర అమోఘం



- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం అడుగులు
- ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు, నవంబర్ 9 (జనంసాక్షి):
తెలంగాణ పునర్నిర్మాణానికి అంకితభావంతో కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం అభినందనీయమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం ముఖ్యమంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని కొడంగల్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన నీలం మధు పుష్ప గుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆయనను ఆప్యాయంగా పలకరించారు.

అనంతరం నీలం మధు మాట్లాడుతూ.. పదేళ్ల పాలనలో తెలంగాణను అప్పుల కుప్పగా మార్చారని గత ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు, సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేస్తూ సంక్షేమం, అభివృద్ధిని సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తున్న నాయకుడు రేవంత్ రెడ్డి అని కొనియాడారు.

ప్రజల వద్దకు పాలనను తీసుకెళ్లాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. మారుమూల గ్రామాల నుంచి పట్టణాల వరకు అభివృద్ధి ఫలాలు చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన వంటి రంగాల్లో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ పునర్నిర్మాణానికి దూరదృష్టి, పట్టుదల, నిరంతర శ్రమ అవసరమని, ఆ దిశగా రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు.

ముఖ్యమంత్రి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, ఆయన నాయకత్వంలో తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలని నీలం మధు ఆకాంక్షించారు.


ఇందిరమ్మ ఇళ్ల వద్ద ఘనంగా దీపావళి సంబరాలు

- లబ్ధిదారులను శాలువాలతో సన్మానించిన సర్పంచులు బందెల సుజాత-బాలకిషన్, స్వర్ణలత-సురేందర్ రెడ్డి



కోహెడ, నవంబర్ 9 (జనంసాక్షి): మండల కేంద్రంతో పాటు తీగలకుంటపల్లి గ్రామంలో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాల మధ్య దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కోహెడ సర్పంచ్ బందెల సుజాత-బాల కిషన్, తీగలకుంటపల్లి సర్పంచ్ మ్యాకల స్వర్ణలత-సురేందర్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

కోహెడలో బందెల రోజా-అజయ్,బిట్ల లావణ్య-గౌరయ్య కుటుంబాలను, తీగలకుంటపల్లిలో బస్వరాజు రమ-రామచంద్రం,ఇట్టిరెడ్డి కనకవ్వ-లక్ష్మారెడ్డి, మెతుకు విజయ-వెంకట్ రెడ్డి, పర్లపెల్లి కనకవ్వ కుటుంబాలను సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపుతోందన్నారు. ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం కోహెడ ఎస్సీ కాలనీలోని బాకూరి మహేందర్ కుటుంబంతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొని గ్రామస్తులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టి సుధాకర్, ఏఎంసీ చైర్ పర్సన్ బోయిని నిర్మల-జయరాజు, జిల్లా నాయకులు మంద ధర్మయ్య, పలువురు సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం వేడుకల్లో పాల్గొన్న సర్పంచ్



వీపనగండ్ల, నవంబర్ 10 (జనంసాక్షి):
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లలో దీపావళి వేడుకలు నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో వీపనగండ్ల మండల పరిధిలోని రంగవరం గ్రామంలో దీపావళి సంబరాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నిర్మాణాలు పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల వద్ద లబ్ధిదారులతో కలిసి గ్రామ పంచాయతీ కార్యదర్శి జీవిత,గ్రామ సర్పంచ్ శివకుమార్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు బిచ్చన్న సాగర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయించి, నిరుపేదలకు శాశ్వత నివాస సౌకర్యం కల్పిస్తోందని తెలిపారు. సొంతింటి కల నెరవేరిన లబ్ధిదారుల ఇళ్లలో దీపావళి వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వినేందర్ రెడ్డి,శివ,ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వింజపల్లిలో ఘనంగా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు

- పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్



కోహెడ, నవంబర్ 9 (జనంసాక్షి): మండలంలోని వింజపల్లి గ్రామంలో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారు పారునంది శంకరవ్వ నూతన గృహాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి మిఠాయిలు పంపిణీ చేసి, టపాసులు కాల్చి దీపావళి సంబరాలు జరుపుకున్నారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీజ-జీవన్ రెడ్డి, ఎంపీడీవో మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టి సుధాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మల-జయరాజ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



ఖిల్లా ఘనపురం, నవంబర్ 9 (జనంసాక్షి):
మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ మాజీ యువజన అధ్యక్షుడు దొరటి మల్లేష్ ఇంట్లో దీపావళి సందర్భంగా నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మల్లేష్ కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, వార్డు సభ్యులు పోలిశెట్టి ప్రతాప్, గోపాల్ బెస్త, ఆంజనేయులు, నరేందర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ అవగాహనతోనే వృద్ధుల హక్కులకు రక్షణ

- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ ముద్దసిర్
- జడ్చర్ల వృద్ధాశ్రమంలో జాతీయ న్యాయ సేవల దినోత్సవం



జడ్చర్ల, నవంబర్ 9 (జనంసాక్షి): న్యాయ విజ్ఞానంతోనే ప్రతి ఒక్కరూ తమ హక్కులను కాపాడుకోగలరని జడ్చర్ల అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ ముద్దసిర్ తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎన్. ప్రేమలత ఆదేశాల మేరకు జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా సోమవారం జడ్చర్లలోని వృద్ధాశ్రమంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం - 2007ను తీసుకువచ్చిందని తెలిపారు. వృద్ధులు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలు పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు, వృద్ధాశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

రోడ్డుపై నిర్లక్ష్యంగా నిలిపిన లారీని ఢీకొన్న బైక్

- ఒక యువకుడు మృతి.. మరో యువకుడి పరిస్థితి విషమం
- బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే మాణిక్ రావు









న్యాల్‌కల్, నవంబర్ 9 (జనంసాక్షి): రోడ్డుపై ఎలాంటి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా నిలిపిన లారీని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన సోమవారం తెల్లవారుజామున న్యాల్‌కల్ మండలం గంగువార్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. హద్నూర్ ఎస్సై సుజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. న్యాల్‌కల్‌కు చెందిన బొల్లి సంగన్న కుమారుడు శ్రీకాంత్ (19), ఎరుకల అంజన్న కుమారుడు సాయికిరణ్ (21) జహీరాబాద్‌లోని మహీంద్రా అండ్ మహీంద్రా ట్రాక్టర్ పరిశ్రమలో పనిచేసేందుకు సోమవారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. అల్లాదుర్గం-మెటల్‌కుంట రహదారిపై గంగువార్ శివారులో ఎలాంటి ప్రమాద సూచికలు లేకుండా నిలిపిన ఏపీ 23 వై 5859 నంబర్ లారీని వారి బైక్ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు.

క్షతగాత్రులను 108 వాహనంలో జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో శ్రీకాంత్ మృతి చెందాడు. సాయికిరణ్‌కు ప్రాథమిక చికిత్స అనంతరం సంగారెడ్డిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. శ్రీకాంత్ తండ్రి సంగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే...

ప్రమాద విషయం తెలుసుకున్న జహీరాబాద్ ఎమ్మెల్యే కే. మాణిక్ రావు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపూర్ శివకుమార్ తదితరులు జహీరాబాద్ ఏరియా ఆసుపత్రి, మార్చురీని సందర్శించారు. మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్, నిర్వాహకులపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సైకి సూచించారు. బాధిత కుటుంబాలను మహీంద్రా అండ్ మహీంద్రా పరిశ్రమ యాజమాన్యం నిబంధనల ప్రకారం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు.

ఇందిరమ్మ గృహాలలో దీపావళి సంబరాలు.. పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



పెద్ద శంకరంపేట, నవంబర్ 9 (జనంసాక్షి): దీపావళి పర్వదిన పురస్కరించుకొని పేట మండల పరిధిలోని రామోజీపల్లిలో దంతల రాధిక భాస్కర్ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ గృహంలో దీపావళి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు..

నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజ లక్ష్మీపూజ కార్యక్రమం నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి దీపాలు వెలిగించి పండుగ వేడుకలు



జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నారాగౌడ్, రాయిని మధు, మురళి పంతులు, సర్పంచులు పెరుమాండ్లగౌడ్, జయశీల అనంతరావు, బి.రవీందర్. వెంకట్రావు ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మైనారిటీ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ దరఖాస్తుల ఆహ్వానం



నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 9 (జనంసాక్షి): తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ ,కెరీర్ కౌన్సిలింగ్ సెంటర్, హైదరాబాద్ ఆధ్వర్యంలో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామక పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న పేద, అర్హులైన మైనారిటీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ,స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎంఎ రషీద్ తెలిపారు. టిజిపి ఎస్సీ గ్రూప్స్-I, II, III, IV, పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై పరీక్షలకు సిద్ధమవుతున్న ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ మైనారిటీ వర్గాల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చునని తెలిపారు. అభ్యర్థులు మైనారిటీ ధృవీ కరణ పత్రం, విద్యార్హత ధృవీకరణ పత్రం, పోటీ పరీక్ష దరఖాస్తు / రిజిస్ట్రేషన్ ప్రతిని పాఠశాల ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటో జతచేసి 12-11-2026 లోగా జిల్లా మైనారిటీ సంక్షేమ కార్యాలయం, నారాయణ పేటలో దరఖాస్తు సమర్పించాలని తెలిపారు.అర్హులైన మైనారిటీ నిరుద్యోగ యువత ఈ ఉచిత సదుపాయా న్ని సద్వినియోగం చేసుకో వాలని కోరారు.

సేవా కార్యక్రమాలతో సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

- రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు



గోపాల్‌పేట, నవంబర్ 8 (జనంసాక్షి): సీఎం ఎ.రేవంత్ రెడ్డి 57వ జన్మదిన వేడుకలను టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధన్వాడ నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జగన్, బాలయ్య, సుధాకర్, కొంకి రమేష్, ఆంజనేయులు, వెంకటమ్మ పాల్గొని సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఉర్కొండలో ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



ఉర్కొండ, నవంబర్ 8 (జనంసాక్షి):
మండల కేంద్రంలో ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆయుబ్ పాషా ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయుబ్ పాషా మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం కోసం సీఎం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో మరిన్ని సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు

కంగ్టి, నవంబర్ 9 (జనంసాక్షి): మండల కేంద్రమైన కంగ్టితో పాటు పరిసర గ్రామాల్లో ఆదివారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. దీప కాంతుల వెలుగులలో లక్ష్మి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి టపాసులు కాల్చారు.

వ్యాపార, వాణిజ్య సముదాయాలను విద్యుత్ దీపాలతో, పూల తోరణాలతో అలంకరించి పూజలు చేశారు. బానాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు



పాపన్నపేట, నవంబర్ 9 (జనంసాక్షి): పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని సర్పంచులు పావని గౌడ్,పద్మ రమేష్ పేర్కొన్నారు. మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమంలో భాగంగా ఆదివారం పాపన్నపేట,మల్లంపేటలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, మండలాధ్యక్షుడు నరేందర్ గౌడ్,ఉపసర్పంచ్ ఉస్మాన్ గౌడ్,వార్డు సభ్యులు శ్రీరామ్ దుర్గయ్య తదితరులు ఉన్నారు.

నిరుపేదల ఇంటి కలను నిజం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు

- వెంకటమ్మ కుటుంబంతో దీపావళి వేడుకల్లో పాల్గొన్న ఎంపీ మల్లు రవి
- అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం: ఎమ్మెల్యే కసిరెడ్డి
- జిల్లాలో ఇప్పటివరకు 2,802 ఇళ్ల నిర్మాణాలు పూర్తి: కలెక్టర్



కల్వకుర్తి, నవంబర్ 08 (జనంసాక్షి):
నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపుతోందని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. ఆదివారం కల్వకుర్తి పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు వెంకటమ్మ కుటుంబంతో కలిసి ఆయన దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో కలిసి కుటుంబ సభ్యులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు సొంత ఇల్లు భద్రతతో పాటు ఆత్మగౌరవాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ముఖ్యంగా గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రాధాన్యత కల్పిస్తామని స్పష్టం చేశారు.


నాలుగు విడతల్లో రూ.5 లక్షల సాయం...
ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ..
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నాలుగు విడతల్లో రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు. ఈ పథకంలో అర్హులైన లబ్ధిదారులెవరూ ఎవరికీ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం పారదర్శకంగా అమలవుతోందని, అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.





జిల్లాలో 2,802 ఇళ్ల నిర్మాణాలు పూర్తి...
జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ..
నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇప్పటివరకు 2,802 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని వెల్లడించారు. రెండో విడతలో మరింతమంది అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. మంజూరైన ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకునేలా అధికారులు, ఇందిరమ్మ కమిటీలు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల,గృహ నిర్మాణ సంస్థ అధికారులు, మున్సిపల్ కమిషనర్ అహ్మద్, ఎంపీడీవో యాదయ్య, తహసీల్దార్, కౌన్సిలర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చేర్యాలలో ప్రజావాణికి అధికారుల డుమ్మా.. ప్రజల తీవ్ర నిరాశ..



చేర్యాల, నవంబర్ 09 (జనంసాక్షి): సిద్దిపేట జిల్లా చేర్యాలలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి సంబంధిత అధికారులు గైర్హాజరు కావడంతో అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు తీవ్ర నిరాశతో వెనుదిరిగారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమానికి అధికారుల గైర్హాజరుపై ప్రజలను నిరాశకు గురి చేసింది. చేర్యాల పట్టణంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి తమ సమస్యలను పరిష్కరించాల్సిన సంబంధిత అధికారులు హాజరుకాకపోవడంతో ప్రజలు వెను దిరిగి వెళ్లారు.

దీపాలతో విద్యార్థుల దీపం ఆకృతి.. ఆకట్టుకున్న దృశ్యం..



చేర్యాల, నవంబర్ 09(జనంసాక్షి):
దీపావళి పండుగను పురస్కరించుకుని స్థానిక పాఠశాలలో విద్యార్థులు దీపాలతో దీపం ఆకృతిని ఏర్పాటు చేసి ఆకట్టుకున్నారు. చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటారని, విద్యార్థులు విద్యా దీపాలను వెలిగించి సమాజంలో చీకటిని తొలగించాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వీరస్వామి, ఉపాధ్యాయులు ప్రభాకర్, సత్యనారాయణ, వెంకటేశం, రవి, గణేష్, హరిప్రసాద్, శైలజ, పద్మ, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

రెడ్యా తండాలో ఘనంగా ముత్యాలమ్మ పండుగ

- వేడుకలో పాల్గొన్న ధ్యాప నిఖిల్ రెడ్డి



ఉర్కొండ, నవంబర్ 09 (జనంసాక్షి): మండలంలోని గుండ్ల గుంటపల్లి గ్రామపంచాయతీ పరిధి రెడ్యా తండాలో ముత్యాలమ్మ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు జర్పుల లావత్ రమేష్ నాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కరాటే రాజు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధ్యాప నిఖిల్ రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించి భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చింతల మనోహర్ రెడ్డి, సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓ వైపు నీటి పొదుపుపై ప్రభుత్వ ప్రచారం.. మరోవైపు నిమ్జ్ పానుల పేరిట నీటి వృథా!

అందులో భాగంగా రోడ్ల కన్స్ట్రక్షన్ నిమిత్తం కుప్పానగర్ గ్రామ శివారు నుండి కంకరను టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ఈ క్రమంలో ప్రతి రోజు దాదాపు 8 కిలోమీటర్ల మేర టిప్పర్లు తిరిగే దారి వెంట వాటర్ ట్యాంకర్ల ద్వార నీటిని వృధాగా పోస్తున్నారు.ఈ తంతు ప్రతి నిత్యం కొనసాగుతుంది. ప్రభుత్వం నీటిని వృదా చేయకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికి ఇక్కడ మాత్రం అధికారులు అదేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా పై అధికారులు స్పందించి నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకునేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

ఈ సందర్భంగా వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 28 ఫిర్యాదులు అందాయన్నారు. మండల, డివిజన్ స్థాయి ప్రజావాణి ఫిర్యాదులను కూడా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రజావాణి ఫిర్యాదులపై రాష్ట్రస్థాయిలోనూ పర్యవేక్షణ చేస్తుండడంతో సంబంధిత అధికారులు అలసత్వం వహించకుండా పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఆదేశించారు.

రైతు మేళాతో ఆధునిక వ్యవసాయంపై అవగాహన

- అదనపు కలెక్టర్ నర్సింగరావు

గద్వాల నడిగడ్డ, నవంబర్ 9 (జనంసాక్షి);
రైతు మేళాతో ఆధునిక వ్యవసాయ పరికరాలు, ఇతర సాంకేతికతపై, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కలుగుతుందని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు.
వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట గ్రామంలో ఈనెల ఏడవ తేదీ నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న కిసాన్ మేళాకు సోమవారం జిల్లా నుంచి 50 బస్సుల్లో రైతులు తరలివెళ్లారు. కలెక్టరేట్ ఆవరణలో అదనపు కలెక్టర్ నర్సింగరావు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా రైతులు వ్యవసాయంలో నూతన విధానాలను అవలంబిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ముఖ్యంగా ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పండించడానికి సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. నేల సారవంతతను కాపాడడానికి రసాయనిక ఎరువుల స్థానంలో నానో యూరియా వినియోగించడం అవసరమని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో భవిష్యత్తు తరాల మనుగడ ఆధారపడి ఉంటుందన్నారు. కాబట్టి రైతులు కిసాన్ మేళాను సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మూడు రోజులపాటు పెద్ద సంఖ్యలో వ్యవసాయానికి, అనుబంధ రంగాలకు సంబంధించిన వివిధ స్టాల్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.



సంగమేశ్వర స్వామికి వైభవంగా ఏకాదశ రుద్రాభిషేకం



శివ్వంపేట, నవంబర్ 9 (జనంసాక్షి): పెద్దగొట్టిముక్ల గ్రామ శివారులోని పురాతన శివాలయంలో కార్తీకమాసం మొదటి సోమవారం, సోమవతి అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. జంట నగరాలతో పాటు ఉమ్మడి జిల్లా నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉమాసమేత సంగమేశ్వర స్వామిని దర్శించుకున్నారు.
వేద పండితులు చండిక ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో గణపతి, గౌరీ పూజల అనంతరం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. పంచామృతాలు, బిల్వదళాలు, పుష్పాలతో అభిషేకాలు చేసి భక్తులు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించారు.
మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మంగళహారతి, తీర్థప్రసాదాల వితరణ చేపట్టారు. ఆలయ నిర్వాహకులు గోళీపల్లి కవిత, హన్మంత్ రెడ్డి, సులోచన ధర్మారెడ్డి, మురళీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు ఎల్‌నినోపై అవగాహన



ముల్దకల్, నవంబర్ 9 (జనంసాక్షి): మండలంలోని సద్దలోనిపల్లిలో సోమవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఎల్‌నినో ప్రభావంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు ఆరుతడి పంటలు, కూరగాయలు సాగు చేయాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలకు ఇంకుడు గుంతల నిర్మాణం, జల సంరక్షణ, నీరు, విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించారు. మూగజీవాల కోసం గ్రామ పరిసరాలు, పొలాల వద్ద నీటి తొట్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాకారులు హజరత్, కేశవుడు, రాహుల్ పాల్గొన్నారు.

అమరచింతలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



అమరచింత, నవంబర్ 8 (జనంసాక్షి): ఆదివారం మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహం దగ్గర రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, పాడి పరిశ్రమ అభివృద్ధి , మత్స్యశాఖ, క్రీడలు యువజన శాఖ మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశానుసారంగా, టీజీ టూడీ టాపర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ సూచన మేరకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ఆయురారోగ్యాలు సుఖసంతోషాలు కలగాలని ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో రాష్ట్ర ప్రభుత్వం పరుగులు పెడుతుందని నాయకులు కార్యకర్తలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలో రాజీవ్ గాంధీ విగ్రహం దగ్గర కేక్ కట్ చేసి, నాయకులు, కార్యకర్తలు పరస్పరం మిఠాయిలు పంచుకున్నారు. జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల పట్టణ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు మున్సిపాలి టీ చైర్మన్ వైస్ చైర్మన్ ప్రజా ప్రతినిధులు కౌన్సిలర్ కోఆప్షన్ సభ్యులు మాత్రమే డైరెక్టర్స్ గ్రామ పార్టీ అధ్యక్షులు సర్పంచులు ఉపసర్పంచ్లు వార్డ్ మెంబర్లు గ్రామ పార్టీ నాయకులు కార్యకర్తలు యువకులు కాంగ్రెస్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు...

- జిల్లా అదనపు కలెక్టర్లు సంగీత, పాండు
- ప్రజావాణిలో 32 దరఖాస్తుల స్వీకరణ

సంగారెడ్డి, నవంబర్ 9 (జనంసాక్షి):

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించే అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ పాండు ఆదేశించారు.

సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులు, దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి ద్వారా సమర్పించే ప్రతి దరఖాస్తుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్దేశిత





గడువులోగా పరిష్కరించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం జరగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 32 దరఖాస్తులు అందాయి. వీటిలో సంగారెడ్డి డివిజన్ 9, నారాయణఖేడ్ 1, జహీరాబాద్ 1, సంగారెడ్డి కలెక్టరేట్‌లో 21 దరఖాస్తులు స్వీకరించారు. అందోల్ డివిజన్ నుండి ఎలాంటి వినతులు అందలేదు.

కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు అఖిలేష్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లలితాదేవి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వసంతకుమారి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెదక్ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా లింగాల సంతోష్ నియామకం

- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు చేతుల మీదుగా నియామక పత్రం అందజేత

మెదక్, నవంబర్ 9 (జనంసాక్షి):





హవేలి ఘనపూర్ మండలం కుచన పల్లి గ్రామానికి చెందిన లింగాల సంతోష్‌ను కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా నియమించింది. ఉమ్మడి మెదక్ మండల మాజీ ఎంపీపీ, దివంగత లింగాల పద్మారావు కుమారుడైన సంతోష్‌కు ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ...

తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యేకు, రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణకు కృషి చేస్తూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు పనిచేస్తానని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా చైర్మన్ తాడేపు మహేందర్, మందుగుల గంగాధర్, నాగరాజ్, కిరణ్ గౌడ్, ఎండీ ఆదిల్ పాషా, ఎండీ సూపి తదితర నాయకులు పాల్గొన్నారు.

నీటిని వృధా చేయకండి : సర్పంచ్ దొడ్ల కవిత

- ఎల్‌నినో ప్రభావం గురించి గ్రామ సభ నిర్వహించిన సర్పంచ్

వీపనగండ్ల, నవంబర్ 09(జనంసాక్షి):



వీపనగండ్ల మండల పరిధిలోని గోపాల్ దిన్నే గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ సర్పంచ్ దొడ్ల కవిత అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దొడ్ల కవిత మాట్లాడుతూ ఏల్‌నినో ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో గ్రామంలో త్రాగునీరుకు ఇబ్బందులేకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వారన్నారు. ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలు ఇంటిదగ్గర నిర్మించుకోవాలని.పొలంలో ఫామ్ కుంటలు నిర్మించుకోవాలని. గ్రామంలో కరువు వచ్చే అవకాశం ఉంది కాబట్టి ఉపాధి హామీ అందరికీ పని దొరికే విధంగా ప్రణాళిక బద్ధంగా పనులు గుర్తించి అందరికీ ఉపాధి పని కల్పించాలని అన్నారు. గ్రామంలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం, ప్రజాప్రతినిధులకు, అధికారులకు తెలియజేసి సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తామని వారన్నారు. ఈ గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శి కర్ణాకర్, ఇ.జి.ఎస్ గంగాధర్, జి.పి.ఒ నరసింహ, వార్డ్ మెంబర్స్ కురుమయ్య,నరేష్, చంద్రయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి డి బాల్ రెడ్డి,గ్రామ పెద్దలు శేఖర్,శేఖర్ రెడ్డి, కురుమయ్య, అంగన్వాడి ఉపాధ్యాయులు, గ్రామ యువకులు గోపాలస్వామి, సుధాకర్, రాజు, సురేష్, ప్రవీణ్ కుమార్ రెడ్డి, మల్లేష్ గ్రామ రైతులు,గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మెగా రైతు మేళాకు బిజ్వార్ రైతుల తరలింపు



మక్తల్, నవంబర్ 9 (జనంసాక్షి): హకీంపేటలో తెలంగాణ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా రైతు మేళాకు మక్తల్ మండలం బిజ్వార్ గ్రామం నుంచి రైతులు పెద్దఎత్తున బయలుదేరారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ రాయితీలపై అవగాహన పొందేందుకు ఈ మేళా ఉపయోగపడుతుందని తెలిపారు. మేళాలోని వ్యవసాయ స్టాళ్లను సందర్శించి విత్తనాలు, ఎరువులు, యాంత్రీకరణపై వివరాలు తెలుసుకోనున్నారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు నడిపెన్న, దొరోల్ల కృష్ణయ్య, హెచ్. నర్సింహా, తాయప్ప, శ్రీనివాస్ రెడ్డి, కేశవులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవకాంతుల ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి సంబరాలు

- కిష్టాపూర్ గ్రామంలో లబ్ధిదారుల ఇంట్లో దీపావళి వేడుకల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్
- పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యం: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

కొల్చారం, నవంబర్ 09 (జనంసాక్షి):



దీపావళి పండుగను పురస్కరించుకుని మెదక్ జిల్లా వ్యాప్తంగా నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశం చేసిన లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ దీపావళి సంబరాల్లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా కొల్చారం మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన జురు లత, సంతోష్ దంపతుల ఇందిరమ్మ ఇంటిలో నిర్వహించిన మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని వారికి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని లబ్ధిదారులు నూతన గృహాల్లో గృహప్రవేశం చేయడం ఎంతో సంతోషకరమని అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమం ద్వారా పేదల ఇళ్లలో కొత్త వెలుగులు నిండుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగుల గారి మల్లేశం గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నిధుల దుర్వినియోగం

- కలెక్టర్‌కు కాశీశీనగర్ గ్రామస్థుడి ఫిర్యాదు

వనపర్తి, నవంబర్ 9 (జనంసాక్షి):



గ్రామ అభివృద్ధి పనులు,రక్షిత మంచినీటి పథకం నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ వనపర్తి మండలం కాశీశీనగర్ గ్రామానికి చెందిన రేవల్లి రాములు సోమవారం ప్రజావాణిలో జిల్లా స్థానిక సంస్థల కలెక్టర్ ఖిమ్యా నాయక్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో పనులు తక్కువగా చేసినప్పటికీ అధిక మొత్తంలో బిల్లులు చూపించి నిధులు డ్రా చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల రూ.1,02,854 నిధులు డ్రా చేయడంతోపాటు బస్టాండ్ సమీపంలో, తండాలో గుంతల రోడ్లకు మట్టి వేసినట్లు చూపించారని తెలిపారు. రక్షిత మంచినీటి పథకం నిధులతోపాటు నిబంధనలకు విరుద్ధంగా మతపరమైన నిర్మాణానికి కూడా ప్రభుత్వ నిధులు వినియోగించినట్లు ఆరోపించారు. పనుల కొలతలు, బిల్లులు, చెల్లింపులపై సమగ్ర విచారణ జరిపించి, అవకతవకలు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కొల్చారం, నవంబర్ 09 (జనంసాక్షి):



నర్సాపూర్ నియోజకవర్గంలోని శ్రీ సాయి కృష్ణ గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, స్థానిక ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొల్చారం మండలానికి మంజూరైన



104 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలతో పాటు, 61 కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు అందజేశారు. కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగుల గారి మల్లేశం గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకుల సమక్షంలో ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమంలో కొల్చారం డిప్యూటీ తహసీల్దార్ నాగ వర్ధన్, ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా, హౌసింగ్ ఏఈ సుష్మ, చిన్న ఘనాపూర్ గ్రామ సర్పంచ్ చందాపురం మధుసూదన్ రెడ్డి, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు జేపీవోలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీ హైటెక్ టికెట్లను రూ.1500తో పునరుద్ధరించాలి

- బీసీ సంక్షేమ సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కొండపాక కనకయ్య
- సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి

చేర్యాల, నవంబర్ 09 (జనంసాక్షి):



తెలంగాణ ఆర్టీసీ ద్వారా గతంలో ఉన్న జూబ్లీ హైటెక్ టికెట్‌ను రూ.1500తో పునరుద్ధరించాలని బీసీ సంక్షేమ సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కొండపాక కనకయ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం చేర్యాల మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో రూ.750తో జూబ్లీ హైటెక్ టికెట్ ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సిటీ, పల్లెవెలుగు, ఎక్స్ ప్రెస్, డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే సౌకర్యం ఉండేదని, ఆ పథకాన్ని రద్దు చేశారని అన్నారు.

రద్దయిన పథకాన్ని రూ.750కు బదులు రూ.1500తో పునరుద్ధరించి రాష్ట్రంలోని అన్ని బస్సుల్లో 10 రోజుల పాటు ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు.అలాగే మహాలక్ష్మి పథకంలో ఆధార్ కార్డుకు బదులుగా మహాలక్ష్మి కార్డును ప్రవేశపెట్టి, ఒక కార్డుకు నెలకు రూ.300 వసూలు చేస్తే ప్రభుత్వంపై భారం కొంత తగ్గుతుందని సూచించారు.

ప్రతి నెలా మహాలక్ష్మి కార్డును రెన్యువల్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సమితి భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్ చార్జ్ అంబటి అంజయ్య, చేర్యాల పట్టణ అధ్యక్షుడు తౌట (అల్లం) రమేష్, కొమురవెల్లి మండల నాయకులు గీస యాదగిరి, బచ్చల నరహరి తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 15న ఆందోల్‌లో మెగా జాబ్ మేళా



- గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.అంజయ్య

రాయికోడు, నవంబర్ 9 (జనంసాక్షి): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో ఈనెల 15న మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి అంజయ్య పేర్కొన్నారు.15న ఉదయం 10:30 గంటల నుండి ప్రముఖ ఎలక్ట్రానిక్ తయారీ కంపెనీ సంస్థ ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూ నిర్వహిస్తారన్నారు. ఇంటర్లో ఎంపికైన వారికి హైదరాబాద్ పరిసర ప్రాంతంలోని కొంగర కాలన్ వద్ద ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. పదవ తరగతి కంటే పై చదువులు ఉన్నవారు ఈ ఇంటర్వ్యూలో పాల్గొనాలని ఆయన తెలిపారు. ఆందోల్ నియోజకవర్గంలోని జేఎన్టీయూ వద్ద నిర్వహించనున్న ఇంటర్వ్యూ కార్యక్రమానికి నిరుద్యోగ యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని లబ్ధి పొందాలని ఆయన కోరారు.

ఇందిరమ్మ ఇండ్లలో దీపావళి సంబరాలు




చేర్యాల, నవంబర్ 09 (జనంసాక్షి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లలో ఆదివారం ఇందిరమ్మ లబ్ధిదారులు దీపావళి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చేర్యాల పట్టణ కేంద్రంలోని ఐదో వార్డులో మోచి లక్ష్మీ బాయి ఉదయకర్, బీడీ కాలనీలోని పాక స్రవంతికి చెందిన ఇందిరమ్మ ఇళ్లలో స్థానిక వార్డు కౌన్సిలర్ వెలుగల దుర్గయ్య హాజరై లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు అంబాల బుచ్చి రాములు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

మెగా రైతు మేళాకు తరలిన కొల్చారం మండల రైతులు



కొల్చారం, నవంబర్ 09 (జనంసాక్షి): వికారాబాద్ జిల్లాలో నిర్వహించనున్న మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్ పో-2026కు మండలంలోని కొల్చారం, పోతంశెట్టిపల్లి, పైతర గ్రామాల మూడు క్లస్టర్‌ల నుంచి రైతులు బయలుదేరినట్లు మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి తెలిపారు.

మృతుడి కుటుంబానికి అండగా పోతేపల్లి సర్పంచ్ తగుళ్ల కొండల్ యాదవ్



వెల్దండ, నవంబర్ 09 (జనంసాక్షి): వెల్దండ మండ పరిధిలోని పోతేపల్లి ఉమ్మడి పోతేపల్లి గ్రామపంచాయతీ పరిధి MG కాలనీ, బావి తండాకు చెందిన బద్రు నాయక్ మృతి పట్ల సర్పంచ్ తగుళ్ల కొండల్ యాదవ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా రూ.3,000 ఆర్థిక సహాయం అందజేసి మనోధైర్యం కల్పించారు.
ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్, యువ నాయకులు ఎగిరిశెట్టి శివ, మార్కండేయుడు, బుషారాజ మధు, లట్టు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్‌లో ఘనంగా 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' సంబరాలు

- లబ్ధిదారుల నూతన గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

నిజాంపేట్, నవంబర్ 8 (జనంసాక్షి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో భాగంగా నిజాంపేట్ మండల కేంద్రంలో ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు.
గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారు బోయి సునీత, మోహన్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి గృహప్రవేశం చేయించారు. అనంతరం ఇంట్లో దీపాలు వెలిగించి దీపావళి సంబరాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పక్కా గృహాలు అందిస్తున్నట్లు తెలిపారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకే దీపావళి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు.





నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతల వారీగా ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో సర్పంచ్ కావ్య సంతోష్ రెడ్డి, మండల అధ్యక్షుడు లింగారెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సంగమేశ్వర్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్ మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు



జగదేవ్‌పూర్, నవంబర్ 9 (జనంసాక్షి): సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లి శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్ పల్లపు మహేందర్ (24) మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. యాదాద్రి భువనగిరి జిల్లా కొండాపూర్‌కు చెందిన మహేందర్ జమ్మూకశ్మీర్‌లోని 54 రాష్ట్రీయ రైఫిల్స్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. సెలవుపై స్వగ్రామానికి వచ్చిన ఆయన, ఆరుగురితో కలిసి మూడు ద్విచక్ర వాహనాలపై కొమురవెల్లి దర్శనానికి వెళ్తుండగా రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన మహేందర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కృష్ణయ్య, రామలింగప్ప తీవ్ర గాయాలతో ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బతికున్న వారికి మరణ ధృవీకరణ పత్రాలు

- రాంపూర్ కార్యదర్శిపై కేసు నమోదు
- చేర్యాల ఎస్సై గూడ అపూర్వ రెడ్డి



చేర్యాల, నవంబర్ 09 (జనంసాక్షి): బతికున్న వారికి మరణ ధృవీకరణ పత్రాలు ఇచ్చి ప్రభుత్వ యంత్రాంగాన్ని, ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నట్లు చేర్యాల ఎంపీఓ పోలీస్ స్టేషన్ లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాంపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి భూక్య మధు పై చేర్యాల పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేసినట్లు చేర్యాల గూడ ఎస్సై అపూర్వ రెడ్డి తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. రాంపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి భూక్య మధు తన వద్ద ఉండాల్సిన ఈ-సైన్ డాంగిల్ కీని అదే గ్రామానికి చెందిన రమేష్ అనే ప్రైవేట్ వ్యక్తికి ఇచ్చాడు. రమేష్ హైదరాబాద్ లో ఇంటర్నెట్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఆ డాంగిల్ కీని ఉపయోగించి బతికున్న వ్యక్తుల పేరిట మరణ ధృవీకరణ పత్రాలను ఫిబ్రవరి 2026 నుండి సెప్టెంబర్ వరకు మధ్య కాలంలో మొత్తం 22 నకిలీ మరణ ధృవీకరణ పత్రాలను జారీ చేసినట్లు గుర్తించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీఓ ఇచ్చిన ఫిర్యాదుతో పంచాయతీ కార్యదర్శి భూక్యా మధు, ప్రైవేట్ వ్యక్తి రమేష్ పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఖిల్లాలో ఘనంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



ఖిల్లా ఘనపురం, నవంబర్ 8 (జనంసాక్షి):
మండల కేంద్రంలోని స్థానిక ప్రయాణికుల ప్రాంగణంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొత్తగొళ్ల కృష్ణయ్య పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు.అనంతరం కొత్తగొళ్ల కృష్ణయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని మండల ప్రజల తరఫున భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దిశ కమిటీ జిల్లా సభ్యులు మూడవత్ రవి నాయక్, సింగిల్ విండో ఉపాధ్యక్షులు క్యామ రాజు, స్థానిక సర్పంచ్ ఆగారం పద్మమ్మ, మామిడిమడ సర్పంచ్ లింగం, వెంకటంపల్లి సర్పంచ్ రామాంజనేయులు, రోడ్డుమీది తండా సర్పంచ్ దేవుజ నాయక్, మార్కెట్ కమిటీ సభ్యులు దుర్గయ్య, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు గౌస్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మ్యాతరీ రాములు, ఘనపురం టౌన్ యూత్ కమిటీ అధ్యక్షులు వడ్డే మధు, ఆంజనేయులు ముదిరాజ్, క్యామ బాలరాజు, నారాయణ, ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల రైతు వేదిక భవనంలో కుంగిన నేల



చేర్యాల, నవంబర్ 09 (జనంసాక్షి): చేర్యాల పట్టణంలోని రైతు వేదిక భవనం నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరుతోంది. భవనం లోపల ఫ్లోరింగ్ టైల్స్ కుంగిపోయి పెద్ద పగుళ్లు ఏర్పడ్డాయి. ప్రధాన ద్వారం వద్ద టైల్స్ పగిలిపోగా బయట కాంక్రీట్ మెట్లు, అరుగు పెచ్చులూడుతున్నాయి. రైతులు, అధికారులు నిత్యం రాకపోకలు సాగించే ఈ భవనానికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.

ఆసరా పెన్షన్ల ప్రారంభంపై లబ్ధిదారుల హర్షం

- సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

సంగారెడ్డి, నవంబర్ 9 (జనంసాక్షి): ప్రజా ప్రభుత్వం ఆసరా పెన్షన్ల పంపిణీ ప్రారంభించడంతో తోగర్‌పల్లి గ్రామంలో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షల మంది అర్హులకు పెన్షన్లు అందించనున్నారని, ఈ నెల నుంచి అర్హులకు రూ.2,000, వికలాంగులకు రూ.4,000 చొప్పున అందసున్నాయని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, జగ్గారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వినయ్ కోట, సూర్యప్రకాష్, మల్లయ్య, నరేష్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ ప్రసాద్ గౌడ్ చేతులమీదుగా ఇందిరమ్మ ఇంటి ప్రారంభం



వెల్దండ, నవంబర్ 9 (జనంసాక్షి): తెలంగాణ ప్రభుత్వం, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాల మేరకు అంకమోని కుంట గ్రామంలో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమం నిర్వహించారు. బొల్లంపల్లి సర్పంచ్ సత్తూరి ప్రసాద్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారు అమృతమ్మ నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఇంట్లో పూజలు నిర్వహించి దీపాలు వెలిగించి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నిరుపేదల సొంతింటి కలను ఇందిరమ్మ ఇళ్లు సాకారం చేస్తున్నాయని, పేదలకు అండగా నిలుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ ఘనత దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చొప్పరి రామకృష్ణ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలపై

అదనపు కలెక్టర్‌కు వినతి



రాజోలి, నవంబర్ 9 (జనంసాక్షి): మండలంలోని తుమ్మిళ్ల, పచ్చర్ల, పెద్ద తాండ్రపాడు, ముండ్లదిన్నె, పెద్ద ధన్వాడ గ్రామాల సర్పంచులు, నాయకులు సోమవారం అదనపు కలెక్టర్ నర్సింగ రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న విద్యుత్, తాగునీరు, పారిశుధ్య సమస్యలతో పాటు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో జరుగుతున్న జాప్యాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల ను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సర్పంచులు కోరారు. స్పందించిన అదనపు కలెక్టర్ నర్సింగరావు గ్రామాల్లోని సమస్యలను పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సర్పంచులు తెలిపారు.

దీపావళి జరుపుకున్న ఎస్పి దంపతులు



నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 9(జనంసాక్షి): దీపావళి పండుగ సందర్భంగా ఆదివారం సాయంత్రం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ సతీమణి ప్రీతి, కుటుంబ సభ్యులతో కలిసి జిల్లా కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో దీపావళి పండుగ ను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దీపాలు వెలిగించి, టపాసు లు కాల్చారు, సిబ్బందికి స్వీట్స్ పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ వినీత్ మాట్లాడుతూ దీపావళినీ చెడు పై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరు పుకునే పండుగ ప్రతి ఒక్కరీ ఇంట్లోకి నూతన వెలుగులు తీసుకొచ్చే పండుగ, అందరూ ఆరోగ్యం, సంతోషాన్ని కోరుకుంటూ సెలబ్రేట్ చేసుకునే పర్వ దినం అన్నారు. ఈ రోజున ప్రజలంతా సుఖ సంతో షలతో ఉండాలని ఆకాంక్షించారు.

జాతీయ స్థాయి అండర్-19 క్రికెట్ పోటీలకు మహమ్మద్ అఫ్వాన్ ఎంపిక

- **శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి వాకిటి శ్రీహరి**



మక్తల్, నవంబర్ 8 (జనంసాక్షి): ఊట్కూరు గ్రామానికి చెందిన విద్యార్థి మహమ్మద్ అఫ్వాన్ జాతీయ స్థాయి అండర్-19 క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. నారాయణపేట క్రికెట్ కోచింగ్ సెంటర్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అఫ్వాన్.. స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ (SGF) ఆధ్వర్యంలో జరిగే ఈ టోర్నమెంట్‌కు తన ప్రతిభతో అర్హత సాధించాడు. ఈ సందర్భంగా అఫ్వాన్ తల్లిదండ్రులు రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరిని కలవగా, మంత్రి ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ స్థాయి లో రాణించి తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు, అమర్ రెడ్డి, సమీవుల్లా కల్వాల్, ఆనంద్ గౌడ్, శ్రీనివాసులు గౌడ్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నూతన కమిటీ పారదర్శకంగా ఎన్నుకోవాలి

- **గత రెండు పర్యాయాలుగా స్థానికేతరుడే కార్యదర్శిగా కొనసాగుతున్న వైనం**
- **జిల్లా కార్యదర్శి,కమిటీ సభ్యులుగా స్థానికులకే అవకాశం కల్పించాలి**
- **ప్రజావాణిలో కలెక్టర్‌కు పిర్యాదు**

అచ్చంపేట, నవంబర్ 9 (జనంసాక్షి): అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూల్ జిల్లాలో ఏర్పాటు చేయనున్న నూతన అథ్లెటిక్స్ అసోసియేషన్ కమిటీ పారదర్శకంగా ఎన్నుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా సీనియర్ క్రీడాకారులు ఎడ్మ శ్రీను యాదవ్,పరశురాముడు,బిక్షపతి యాదవ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.నూతన జిల్లాల పునర్విభజనలో భాగంగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుండి విడిపోయి కొత్తగా ఏర్పడిన నాగర్ కర్నూల్ జిల్లాలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ అసోసియేషన్ కమిటీ నిబంధనలకు విరుద్ధంగా సక్రమంగా ఏర్పాటు చేయలేదని క్రీడాకారులు వాపోయారు.నాలుగు సంవత్సరాలకు ఒకసారి ఏర్పాటు చేసే ఈ క్రీడా సంఘాలలో అవకతవకలు జరిగాయని స్థానికులకు కాకుండా స్థానికేతరులు జిల్లాలో పెత్తనం చెలాయిస్తూ తాము చెప్పేదే వేదం,తాము ఆడిందే ఆట పాడిందే పాటగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా కొనసాగుతున్న సోలపోగుల స్వాములు గద్వాల జిల్లా అలంపూర్ మండలం బుక్కాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి కాగా నాగర్ కర్నూల్ జిల్లాలో పాగవేసి తానే రాజు తానే మంత్రి అన్న చందంగా అథ్లెటిక్స్ అసోసియేషన్ ద్వారా ఎంపికలు నిర్వహిస్తున్నారన్నారు.జిల్లా కార్యదర్శిగా కొనసాగుతున్న వ్యక్తి హైదరాబాదులో నివాసం ఉంటూ,ఇతర జిల్లాలో ఉద్యోగం చేస్తూ నాగర్ కర్నూలు జిల్లాలో ఎలా కార్యదర్శి గా కొనసాగుతున్నాడనీ అసలు ఇందులో ఉన్న అంతర్యం ఏంటో అర్థం కావడం లేదని సీనియర్ క్రీడాకారులు వాపోయారు.జిల్లా నుండి ఎంతో మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించిన క్రీడా సంఘం ఏర్పాటు కు వచ్చే సరికి తమకు ఎందుకు పక్కదోవ పట్టిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. గత నాలుగు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ అసోసియేషన్ కమిటీ పదవీకాలం ఈనెలతో ముగియనుండటంతో కొత్త కమిటీ ఏర్పాటు చేసే దిశగా పాత కార్యదర్శి పావులు కదుపుతున్నట్టు సమాచారం.దీని గురించి సమాచారం తెలుసుకున్న క్రీడాకారులు సోమవారం ఉదయం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. నూతనంగా ఏర్పడే అథ్లెటిక్స్ అసోసియేషన్ కమిటీలో కచ్చితంగా స్థానికులకే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

మెగా రైతు మేళాకు పెద్దకొత్తపల్లి రైతుల భారీ తరలింపు



పెద్దకొత్తపల్లి, నవంబర్ 9 (జనంసాక్షి): కోడంగల్ నియోజకవర్గంలో తెలంగాణ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న మెగా రైతు మేళాకు పెద్దకొత్త పల్లి మండలంలోని వివిధ గ్రామాల నుంచి రైతులు భారీగా తరలివెళ్లారు. వెన్నచర్ల, నక్కలపల్లి, పెద్దకొత్తపల్లి, పెద్ద కార్పాముల, కల్వకోల్, యాపట్ల తది తర గ్రామాల రైతులు పాల్గొన్నారు. నక్కలపల్లి సర్పంచ్ మొట్టే కురుమయ్య, ఉపసర్పంచ్ కొత్త రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ డి. రవికుమార్ రైతులతో కలిసి బయలుదేరారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతను పరిచయం చేయాలనే లక్ష్యంతో మెగా రైతు మేళా నిర్వ హించడం అభినందనీయమన్నారు. శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన నూతన వంగడాలు, ఆధునిక యంత్రాలు, వాటి వినియోగం, వాతావరణానికి అనుగుణంగా పంటల సాగుపై అవగాహన పొం దేందుకు ఈ మేళా ఉపయోగపడుతుందని తెలి పారు. ఆధునిక పద్ధతులతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మద్దని పద్మ, అగారయ్య, నాగమ్మ, చిన్న సుల్తాన్, చిన్న నర్సింహా, సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్‌లో సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



మిడ్జిల్, నవంబర్ 8 (జనంసాక్షి): తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం మిడ్జిల్ మండల కేంద్రం లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ ఆవరణలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ గౌస్, సర్పంచ్ ఎర్ల శంకర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. మండల పరిధిలోని వాడ్యాల గ్రామం వద్ద గడ్డల విజయకుమార్ ఆధ్వర్యంలో కూడా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో గౌస్ రబ్బాని, సాయిలు, గోదా శ్రీశైలం, రాము లు, గుడ్ల బాలయ్య, నాగరాజు, మాజీ ఎంపీటీసీ శివప్రసాద్, విజయకుమార్, మల్లయ్యతో పాటు వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



క్రీడలు ఆడండి ఆరోగ్యంగా ఉండండి: ఎస్సై జె.నరేష్ కుమార్



వీపనగండ్ల, నవంబర్ 10 (జనంసాక్షి): దీపావళి, గంగమ్మ జాతర, పాముకాటు సందర్భంగా వీపనగండ్ల మండల కేంద్రంలో కొల్లాపూర్ తాలూకాస్థాయి కబడ్డీ పోటీలను ఘనంగా నిర్వహించారు.గ్రామంలో పార్టీలకు అతీతంగా నాయకులు,ప్రజాప్రతినిధులు క్రీడా పోటీలను అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై జె.నరేష్ కుమార్ మాట్లాడుతూ క్రీడలు యువతలో ఐక్యత,క్రమశిక్షణ,స్నేహభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు.క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు.క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఖాజా మొయినుద్దీన్, గ్రామ సర్పంచ్ మీసాల పార్వతమ్మ,బిఆర్ఎస్ నాయకుడు ముంత మల్లయ్య యాదవ్,కాంగ్రెస్ నాయకులు రవీందర్ రెడ్డి,కావలి మహేష్,శివ,వార్డు సభ్యులు పెబ్బేటి మహేష్, సుబ్రహ్మణ్య చారి, దయ్యపు వెంకటేష్,బిఆర్ఎస్ యువ నాయకుడు ముంత శివ యాదవ్, ఉపాధ్యాయులు గంగన్న,తులసి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సిర్గాపూర్ ప్రజావాణికి ఒక్క దరఖాస్తు



సిర్గాపూర్, నవంబర్ 9 (జనంసాక్షి): సిర్గాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వ హించిన ప్రజావాణి కార్యక్రమానికి ఒక్క దరఖాస్తు వచ్చినట్లు ఎంపీడీఓ అండాలమ్మ తెలిపారు.ప్రజల నుంచి వచ్చిన వినతిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారు లను ఆదేశించారు.కార్యక్రమంలో ఎంఈఓ నాగారం శ్రీనివాస్, ఎంపీఓ బ్రహ్మయ్య, సూపరింటెండెంట్ శ్రీనివాస్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేదారేశ్వరి పూజలు



మల్దకల్, నవంబర్ 9 (జనంసాక్షి): ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాల యం ఆవరణలోని శివాల యంలో సోమవారం కేదారే శ్వర పూజలు ఘనంగా జరి గాయి. ఆలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీకృష్ణ మాన్య పట్వారి ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు పూజలు నిర్వహించారు. అలాగే అమావాస్య సందర్భంగా దేవాలయానికి వచ్చిన భక్తు లకు అన్నదానం కాకతీయ టెక్నో స్కూల్ వారు ఏర్పాటు చేయ గా పూజలు నిర్వహించి ప్రారంభించారు. దీపావళి పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాల భక్తులు స్వామివారిని దర్శించు కున్నారు. దీపావళి పండుగ సందర్భంగా గ్రామ గ్రామా ఘనంగా జరుపుకున్నారు. బాణాసంచా కాలుస్తూ పెద్ద ఎత్తున దీపావళి సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి.

భక్తిశ్రద్ధలతో ఉసిరి చెట్టుకు పూజలు



రాజోలి, నవంబర్ 9 (జనంసాక్షి): కార్తీక మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని సోమవారం రాజోలి మండల కేంద్రంలోని లక్ష్మీ వైకుంఠ నారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్టును భక్తులు పూజించి, దీపారాధన చేశారు. ఉసిరి చెట్టు పూజతో పుణ్యఫలం లభిస్తుందని విశ్వసిస్తూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ రెడ్డి, శివస్వాములు, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కొడిపల్లి మండలానికి 73 కళ్యాణలక్ష్మి చెక్కులు మంజూరు

• కలెక్టర్ ప్రతిమాసింగ్, మంత్రి వివేక్, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చేతుల మీదుగా పంపిణీ



కొడిపల్లి, నవంబర్ 9 (జనంసాక్షి): పేదింటి ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి పథకం ద్వారా కొడిపల్లి మండలానికి 73 చెక్కులు మంజూరయ్యాయి. సోమవారం నర్సాపూర్ పట్టణంలోని సాయికృష్ణ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ విషయాన్ని తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్ వెల్లడించారు.

కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్, రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి, మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారి చేతుల మీదుగా కొడిపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు.



ఈ సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహ సమయంలో తల్లిదండ్రులకు ఆర్థిక ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం కళ్యాణలక్ష్మి పథకం ద్వారా సహాయం అందిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అర్హులైన కుటుంబాలకు పథకాల ప్రయోజనాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

మండలానికి 73 చెక్కులు మంజూరు కావడంతో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఆర్థిక సహాయం తమ కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో వెల్మకన్న గ్రామ సర్పంచ్ కుమ్మరి శివలీల సతీష్, ఉపసర్పంచ్ ప్రభు, మాజీ సర్పంచ్ రాజేందర్, బీఆర్ఎస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రవి సాగర్‌తో పాటు వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఏ.ఎస్.డీ.డీ ఓటర్లకు మరో సువర్ణ అవకాశం

• అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ



జడ్చర్ల, నవంబర్ 9 (జనంసాక్షి): ఎస్ఐఆర్-2026 ముసాయిదా ఓటర్ల జాబితాలో ఏ.ఎస్.డీ.డీ కేటగిరీ కింద పేర్లు తొలగించబడిన అర్హులకు తుది జాబితాలో చోటు దక్కించుకునేందుకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు మహబూబ్‌నగర్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ తెలిపారు. సోమవారం జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. పార్టీల ప్రతినిధులకు ఏఎస్డీడీ జాబితాలను అందజేశామని, బూత్ స్థాయి ఏజెంట్లు బిఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ అర్హులైన ఓటర్ల నుంచి ధ్రువీకరణ పత్రాలతో క్లెయిమ్‌లు సమర్పించేలా చూడాలని కోరారు. క్షేత్రస్థాయి పరిశీలన జరిపి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు తుది జాబితాలో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జడ్చర్ల, బాలానగర్, రాజాపూర్, నవాబ్‌పేట్, మిడ్జిల్ తహసీల్దార్లు, జడ్చర్ల అదనపు, డిప్యూటీ తహసీల్దార్లు, ఉర్కొండ, రాజాపూర్, మిడ్జిల్, నవాబ్‌పేట్ ఎంపీడీవోలు పాల్గొన్నారు.

సస్పెన్షన్ల వేటు పరంపర..



పాపన్నపేట, నవంబర్ 9 (జనంసాక్షి): మెదక్ జిల్లాలో 40 గ్రామపంచాయతీలు గల అతి పెద్ద మండల మైనా పాపన్నపేటలో అధికారులపై సస్పెన్షన్ల వేటు పరంపర కొనసాగుతుంది. మండల పరిధి లోని డాక్యా తాండ గ్రామపంచాయతీ కార్యదర్శి ఇశ్రాత్ బేగంను సస్పెండ్ చేశారు. పంచాయతీ రాజ్,గ్రామీణ ఉపాధి శాఖ కమిషనర్ డి.దివ్య ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలలోకి వెళితే .. ఉపాధి హామీ పనులకు సంబంధించి డాక్య తండా,పరిసర తండాల పరిధి లోని వివిజీ రామ్ జీ కూలీల పేర్లు జాబ్ కార్డులు జాబితా నుండి గల్లంతయ్యాయని నవంబర్ 2 న జరిగిన ప్రజావాణిలో అధికారులకు సర్పంచ్ ద్వారా ఫిర్యాదు అందింది. వెను వెంటనే పాపన్నపేట ఎంపీడీఓ విష్ణువర్ధన్ ను సస్పెండ్ చేశారు. అదే బాటలో ఈ నెల 7 న గ్రామపంచాయతీ కార్యదర్శి ఇశ్రాత్ బేగం ని సైతం సస్పెండ్ చేశారు. విధుల్లో అలసత్వంగా ఉన్నందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు అ ఉత్తర్వుల్లో వెల్లడించారు.

మహమ్మదాబాద్‌లో ఘనంగా దీపావళి సంబరాలు

• దీపావళిలో గాధిర్యాల్ చిన్నారుల హంగామా..

• ఇందిరమ్మ ఇళ్లల్లో దీపాలు వెలిగించిన కాంగ్రెస్ నాయకులు..



మహమ్మదాబాద్,నవంబర్ 09(జనంసాక్షి): దీపావళి పండుగను పురస్కరించుకుని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ, ఇండ్లలలో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండల వ్యాప్తంగా, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు కలిసి.దీపావళి సంబరాల్లో పాల్గొని లబ్ధిదారులతో ఆనందాన్ని పంచుకున్నారు.అనంతరం ఒకరికొకరు దీపావళి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కేఎం నారాయణ,మాట్లాడుతూ..ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తుంది అని అన్నారు. దీపావళి వేడుకలను ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని అన్నారు.



దీపావళిలో గాధిర్యాల్ చిన్నారుల హంగామా..

గాధిర్యాల్ గ్రామంలో దీపావళి వేడుకలను గ్రామమంతా దీపాల వెలుగులతో కళకళలాడింది. చిన్నారులు, ఉత్సాహంగా టపాసులు కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. రంగురంగుల బాణసంచా వెలుగులతో గ్రామ వీధులు కాంతులీనగా,చిన్నారుల కేరింతలు, ఆనందోత్సాహాలతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు జె.రాంలాల్, మాజీ ఎంపీపీ శాంతిరంగ్యా,జిల్లా కార్యవర్గ సభ్యుడు అనంతయ్య గుప్తా, గ్రామ అధ్యక్షుడు ఊరటి అశోక్, మండల ఉపాధ్యక్షుడు కొత్త నర్సింలు, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు డాక్టర్ రహీం, మోహన్, మైభయ్యా, డీలర్ శివ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చైతన్య శోభ.. పుణ్యఫలాల కార్తీక మాసం

• నేటి నుంచి ప్రారంభం... డిసెంబర్ 8న ముగింపు

• హరిహరుల ఆరాధనకు ప్రశస్తమైన సమయం

• ఆలయాల్లో మారేడు అర్చనలు, నిత్యాభిషేకాలు




జడ్చర్ల, నవంబర్ 9 (జనంసాక్షి): తెలుగువారి సంస్కృతి, ఆధ్యాత్మిక జీవన విధానంలో కార్తీక మాసానికి ఎంతో విశిష్ట స్థానం ఉంది. హిందూ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైనదిగా భావించే ఈ మాసం నేటి నుంచి (నవంబర్ 10, మంగళవారం) ప్రారంభమై డిసెంబర్ 8వ తేదీ (మంగళవారం) వరకు కొనసాగనుంది. ఈ నెల రోజుల పాటు శివకేశవుల ఆరాధనకు భక్తులు విశేష ప్రాధాన్యమిస్తారు. సూర్యోదయానికి ముందే నదీ స్నానాలు, ఉపవాస దీక్షలు, ఆలయాలు మరియు ఇళ్ల ముందు వెలిగించే దీపకాంతులతో జడ్చర్ల నియోజకవర్గవ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్తీక మాసంలో ఉదయాన్నే విష్ణుసహస్రనామ పారాయణం, సాయంత్రం శివాభిషేకాలు జరపడం పూర్వకాలం నుండి వస్తున్న ఆచారం. ముఖ్యంగా ఉసిరి లేదా తులసి కోట వద్ద ఆవు నెయ్యితో దీపారాధన చేయడం అత్యంత శుభప్రదమని భక్తులు నమ్ముతారు. కార్తీక పౌర్ణమి (నవంబర్ 24) నాడు 365 వత్తులతో దీపాలు వెలిగించి నదులలో వదలడం ద్వారా విశేష పుణ్యఫలం లభిస్తుందని వేదపండితులు తెలిపారు. ఈ మాసంలో వచ్చే ప్రతి సోమవారం (నవంబర్ 16, 23, 30, డిసెంబర్ 7) ఆలయాల్లో ప్రత్యేక పూజలు, జ్వాలా తోరణాల ఉత్సవాలు కోలాహలంగా జరుగుతాయి. ఆధ్యాత్మికతతో పాటు సామాజిక సమరసతను పెంపొందించేందుకు కార్తీక వనభోజనాలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. మహోత్సవాల సందర్భంగా జడ్చర్ల ప్రాంతంలోని ప్రసిద్ధ ఆలయాలన్నీ విద్యుత్ దీపాలంకరణలతో దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి.

రైతుమేళాకు కాంగ్రెస్ శ్రేణులజోరు..

• అకింపేటకు భారీగా తరలిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు..



మహమ్మదాబాద్, నవంబర్ 09 (జనంసాక్షి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొననున్న రైతు మేళా సభకు మహమ్మదాబాద్ మండల కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. సోమవారం అకింపేట్‌లో నిర్వహించనున్న రైతు మేళా సభను విజయవంతం చేయాలనే లక్ష్యంతో మండలంలోని, పలు గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా బయలుదేరారు. మండలంలోని చౌదర్‌పల్లి,గాధిర్యాల్,నంచర్ల,చౌదర్‌పల్లి పెద్దతండా,మొక్కర్లబాద్,దేశాయిపల్లి తదితర గ్రామాల నుంచి సర్పంచులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు సభకు తరలివెళ్లారు.రైతు సంక్షేమమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రైతు మేళాకు కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లి తమ సంఘీభావాన్ని చాటుకున్నారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ,సర్పంచుల సంఘం అధ్యక్షుడు జే.రామ్‌లాల్,మాజీ ఎంపీపీ శాంతిరంగ్య,వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.రాఘవేందర్‌రెడ్డి,వార్డు సభ్యుడు జి.పాండు,గుప అనంతయ్య, కొత్తపేట శ్రీనివాసులు, టీ.రాములు, లక్ష్మీనారాయణ, జి.హన్మంత్, ఆయా గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు, మహిళా సంఘాల సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



చదువులు ముందుకు సాగేదెలా...

- చదువు నేర్పడానికి భయపడు తున్న ఉపాధ్యాయ లోకం
- వికృత చేష్టలతో దారికి రాని విద్యార్థులు
- దండన నిషేధించడం వల్లనే దారిద్రం చుట్టుకుందా లేదా క్రమశిక్షణారాహిత్యమా..
- పిల్లలను పట్టించుకోని తల్లిదండ్రులు
- చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్న విద్యార్థి లోకం

శివ్వంపేట, నవంబర్ 9 (జనంసాక్షి):

దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుంది "ఆ తరగతి గదిలో విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించేది ఉపాధ్యా యులేనని కొఠారి కమిషన్ నివేదిక తెలియ జేసినప్పటికీ ప్రస్తుతం ఆ తరగతి గదిలో పాఠాలు బోధించ డానికి ఉపాధ్యాయ లోకం భయంతో జంకుతున్నారు. సమాజంలో వచ్చిన పెను మార్పుతో విద్యార్థులు చేస్తున్న వికృత చేష్టలు ఉపాధ్యాయ లోకం గజ గజ వణికేలా చేస్తున్నాయి. ఒకప్పుడు ఉపాధ్యాయులను అల్లంత దూరంలో చూడగానే ఏ సందులోకో, ఏ మూలకో భయపడుతూ, పరుగులు పెడుతూ దాక్కునె "వారు. కానీ నేడు అందుకు విరుద్ధంగా సమాజం ముందుకు వెళు న్నది. ఇది ఆషామాషి వ్యవహారం కాదు, దేశ హితం కోరే సమాజం వీటన్నిటిని గమనిస్తూ నిస్సిగ్గుగా తలదించుకొని ముందుకు వెళుతున్నది. ఇదేనా మనం భావితరాలకు అందించే బంగారు భవిష్యత్తు అంటూ ఈ లోకం ముక్కున వేలు వేసుకుంటున్నది. విద్యార్థి తప్పు చేస్తే తరగతి గదిలో బెత్తంతో దండించినప్పుడు తమ తప్పు తెలుసుకుని సన్మార్గం లో పెట్టిన పరిస్థితి అప్పట్లో ఉండేది. ఒకవేళ ఉపాధ్యాయులు తమను దండించారని దండనకు గురైన ఆ విద్యార్థి వారి ఇంట్లో చెబితే నీవు ఏమి తప్పు చేశావో అని అందుకే గురువు గారి దండనకు గురయ్యావని తల్లిదండ్రులు సైతం చితకబాది తమ పిల్లలను ఎలాగైనా దారికి తీసుకొని రావాలని ఉపాధ్యా యులను ప్రాధేయపడిన సందర్భాలు కోకొల్లాలు, ఇవన్నీ ఒకప్పుడు సర్వసాధారణంగా జరిగాయి. కానీ ప్రస్తుత ఆధునిక పోకడలతో, డిజిటల్, విచ్చలవిడి సెల్ ఫోన్ యుగంలో తరగతిగది రూపురేఖల్లో భయానక వాతావరణం నెలకొంది. ఉపాధ్యాయులు తరగతి గదిలో తమ యావత్ శక్తిని వినియోగించి పాఠాలు చెప్పే పరిస్థి తులు తారుమారవుతున్నాయి. విద్యార్థుల వికృత చేష్టలు, పిట్టగూడుల చింపిరి జుట్టు, కంతలు ఉన్న వికృత ఫ్యాషన్ దుస్తులు, గబ్బు కొట్టే నోటి కంపుతో, చిరాకు పుట్టించే రబ్బరు తొడుగుల ఫ్యాషన్ చెప్పులతో ఉన్న విద్యార్థులకు తరగతి గదిలో పాఠాలు చెప్పడం ఉపాధ్యాయులకు కత్తి మీద సాములా మారింది. ఆ విద్యార్థులలో మార్పు తీసుకురావడానికి ఉపాధ్యాయులు చేస్తున్న ప్రయత్నం వృధా ప్రయాసగా మారుతున్నది. దీనికి తోడు విచ్చలవిడిగా దొరుకుతున్నగం జాయి, డ్రగ్స్ చాక్లెట్లు, యాష్ అయిల్ లతో విద్యార్థి లోకం అధర్ పాతాళానికి దిగజారిపోతున్నారు. ఇలాంటి విద్యార్థులకు పాఠాలు బోధించి వారిని దారిలోకి తీసుకురావడం అనేది ఉపాధ్యాయులకు నరకప్రాయంగా, కత్తిమీధి సాముగా మారుతున్నది. ఈ విద్యార్థులకు గ ట్టిగా బుద్ధిచెప్పి దారిలోకి తీసుకురావాలనే ప్రయత్నాలకు విద్యార్థులు అడ్డదిడ్డంగా వ్యవహరించి, ఉపాధ్యాయుల పైనే తిరగబడుతున్న సందర్భాలు ప్రాణాంతకంగా మారుతున్న వికృత సందర్భాలు ఉపాధ్యాయు లను తరగతి గదికి దూరం చేస్తున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను ఏ కోశానా పట్టించుకుంటున్నట్లు కనబడటం లేదు. తమ తమ సొంత కార్య కలాపాలలో మునిగి ఉండడం వల్ల వారి వారి పిల్లలు వికృతంగా మారుతూ, వింతగా ప్రవర్తిస్తున్నారని పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుత ఉపాధ్యాయులు బెత్తం ఉపయోగించలేని పరిస్థితులు దాపురించడం వలన దండన లేకపోవడం వలనే క్రమశిక్షణారాహిత్యం లోపించి ఉపాధ్యాయుల మీదకే వాదనలకు దిగుతున్నారని లోకం కూడా వస్తున్నది. పాఠశాలల్లో దం డన నిషేధించడం వల్ల క్రమశిక్షణ లేక "పోవడంతో ఈ విద్యార్థులలో వికృత చేష్టలు పెరిగి పోలీస్ స్టేషన్లో దండించుకునే దుస్థితి నెలకొంది. తల్లిదండ్రులు తమ పిల్లలను పూర్తిగా వదిలివేయడం వారిని పట్టించుకోకపోవడం అసలు పాఠశాలల్లో తమ పిల్లల నడవడిక ఎలా ఉందో తెలుసుకునే ప్రయత్నాలు చేయకపోవడంతో ఆ పిల్లలు, వారి తల్లిదండ్రులకు కూడా నరకాన్ని చూపిస్తు న్నారు. గోటితో పోయేదాన్ని గొడ్డలి దాకా తెచ్చుకుంటున్నట్లు తల్లిదండ్రుల అసమర్థత పిల్లలకు శాపంగా మారుతున్నది. వారి పిల్లల వికృత చేష్టలను



తరగతి గదిలోనే దండనతో తుంచి వేస్తే, తమ పిల్లలు క్రమశిక్షణతో మెల ఎగుతారనే విషయాన్ని తల్లితండ్రులు ఆమడ దూరంలో పెట్టడం వలన పిల్లలు అటు చదువులకు, ఇటు స మాజానికి అంటే ఎందుకు పనికిరాని వారిగా మారిపోతున్నారు. ఉపాధ్యా యులు తమ శిష్యులను ఉన్నత శిఖరాలు అధిరోహించేలా తీర్చిదిద్దడానికి ఆహర్నిశలు శక్తివంచన లేకుండా కృషికి చేస్తున్నప్పటికీ, దానికి తల్లితండ్రులు వారి పిల్లలపై పెంచుకున్న పిచ్చి ప్రేమ గండి కొడుతున్నది. నవతరాన్ని చక్కదిద్దడానికి ఉపాధ్యాయ లోకంతో తల్లితండ్రులు కలిసి వచ్చి నూతన ఒరవడితో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టినప్పుడే భావి భారత భవిష్యత్తు సక్రమంగా ఉంటుంది. విద్యావ్యవస్థలో నూతన ఒరవడిని తీసుకురావడానికి అధికార యం త్రాంగం, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, విద్యార్థుల తల్లితండ్రులు కలిసికట్టుగా ఏకతాటిపైకి వచ్చి ఉద్యమించినప్పుడే కేంద్రం తీసుకువచ్చిన విద్య చట్టంలో లో సుగులు బయటపడే అవకాశం ఉన్నది. విద్యార్థి లోకం తరగతి గదిలో దండనకు గురైనప్పుడే దేశ దారిద్రం తొలగిపోతుందని నేటి సమాజం గుర్తించాలి. అలా విద్యార్థుల భవిష్యత్తుకు వ్యూహ రచన చేసినప్పుడే జెన్ జీ భవిష్యత్తు బంగారుమయం అవుతుంది. సమాజంలో గంజాయి, డ్రగ్స్ మహమ్మారిని కూకటివేళ్లతో కూల్చడానికి అన్ని వర్గాలవారు శక్తి వంచన లేకుండా కృషి చేసినప్పుడే నవతరాన్ని భావి భారత తరాన్ని రక్షించుకోగలుగుతాం, దేశ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన వాళ్ళం అవుతాం లేదంటే సమాజంలో ఆటవిక రాజ్యం ఏర్పడి, అది నేటి రాజ్యపాలనను అంతం చేసి, క్రూరం కషా రాజ్య స్థాపన జరగబోతుందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. విద్యావ్యవస్థలో ఏర్పడ్డ విశ్రుంకలాలు తెంచుదామా, మౌనంగా ఊరుకుందామా. నేటి సమాజం ఆలోచించాలంటున్నారు.

రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ నీరు.. మూడేళ్లుగా తప్పని ఇబ్బందులు

రేవల్లి, నవంబర్ 08 (జనంసాక్షి):



రేవల్లి మండలం బండరావిపాకుల గ్రామంలో డ్రైనేజీ నీరు నాగర్ కర్నూల్, కొల్లాపూర్, వనపర్తి వైపుల వెళ్లే ప్రధాన రహదారిపై పారుతూ ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది.

ఈ సమస్య నిన్న మొన్నటిది కాదు. గత మూడు సంవత్సరాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై మురికి నీరు నిలవడం వల్ల ద్విచక్ర వాహనదారులు జారిపడి కాళ్లు, చేతులు విరిగి గాయాలపాలవుతున్నారని, అనేకమంది ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు.

ప్రతిరోజూ ఈ రోడ్డుపై ప్రయాణించే నాగర్ కర్నూల్, కొల్లాపూర్, వనపర్తి వైపు వెళ్లే ప్రయాణికులు భయం భయంగా వెళుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు కోరినా పరిష్కరించలేకపోతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి డ్రైనేజీ వాటర్ సమస్యను వెంటనే పరిష్కరించాలని ముంపు గ్రామ ప్రజల తరపున గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

- ప్రజావాణి లో 52 దరఖాస్తులను స్వీకరణ
- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



మెదక్ బ్యూరో, నవంబర్ 9 (జనంసాక్షి):

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. సోమవారం, ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో విద్యార్థులను స్వీకరించారు. ఈరోజు 52 దరఖాస్తు లను స్వీకరించారు.అందులో భూ భారతి 17, ఇందిరమ్మ ఇండ్లు 11,పెన్షన్01, ఇతర 23 మొత్తం 52 .

ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని దరఖాస్తులకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్‌లో భక్తిశ్రద్ధలతో దీపావళి వేడుకలు

- పండుగ శోభతో వెలిగిపోయిన అమీన్‌పూర్, ధరల భారంతో సామాన్యుల ఇబ్బందులు

అమీన్‌పూర్, నవంబర్ 9(జనంసాక్షి):

అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని అమీన్‌పూర్, బీరంగూడలో ఆదివారం దీపావళి పండుగ శోభతో కళకళలాడింది. బీరంగూడ, అమీన్‌పూర్ ప్రాంతాల్లో ప్రజలు ఎంతో ఉత్సాహంగా, భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకున్నారు. ఎక్కడ చూసినా దీపాల వెలుగులు, టపాకాయల మోతలతో పండుగ వాతావరణం నెలకొంది. పండుగ రోజు ఉదయం నుంచే ప్రజలు ఇళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే లేచి ఇళ్ల ముంగిళ్లను శుభ్రం చేసి, రంగవల్లులు తీర్చిదిద్దారు. కుటుంబ సభ్యులంతా కలిసి దేవుడికి పూజలు చేసి, పండుగ సంప్రదాయాలను పాటించారు. పలు ఆలయాల్లోనూ భక్తుల రద్దీ కనిపించింది.

మహిళలు తమ ఇళ్లలో బొమ్మల కొలువులు ఏర్పాటు చేసి, భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకున్నారు. ఇరుగుపొరుగు వారిని ఆహ్వానించి, పసుపు కుంకుమలు, పండ్లు, తాంబూలాలు అందజేశారు. బంధుమిత్రుల రాకపోక లతో ఇళ్లలో సందడి నెలకొంది.

సాయంత్రం వేళ వ్యాపార సంస్థల్లో లక్ష్మీదేవి పూజలు ఘనంగా జరిగాయి.





వ్యాపారులు తమ దుకాణాలు, కార్యాలయాలను పూలమాలలు, విద్యుద్దీపా లతో అలంకరించి, కొత్త లెక్కల పుస్తకాలకు పూజలు చేశారు. తమ వ్యాపారం ఏడాది పొడవునా లాభసాటిగా సాగాలని లక్ష్మీదేవిని ప్రార్థించారు.

చీకటి పడగానే చిన్నారులు, పెద్దలు అనే తేడా లేకుండా అందరూ వీధుల్లోకి వచ్చి టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. మతాబులు, చిచ్చుబుడ్లు, కాకరపువ్వొత్తులు, భూచక్రాలు వెలుగులు విరజిమ్మాయి. పిల్లల కేరింతలతో



కాలనీలు, అపార్ట్‌మెంట్లు సందడిగా మారాయి.

ధరల మోతతో ఇబ్బందులు..

ఒకవైపు పండుగ సంబరాలు జరుగుతుండగా, మరోవైపు అన్ని వస్తువుల ధరలు పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పూజా సామగ్రి ధరలు ఆకాశాన్ని తాకాయి. పూలు, పండ్లు, కొబ్బరికాయలు, ఇతర పూజా సామాగ్రి కొనుగోలుకు సామాన్యులు ఎక్కువ మొత్తం వెచ్చించాల్సి వచ్చింది. టపాకాయల దుకాణాల్లోనూ ధరలు మండిపోయాయి. దుకాణానికి వెళ్తే కనీసం రూ.1,000 పైనే ఖర్చవుతోందని, పిల్లల సరదా కోసం తప్పక కొనాల్సి వచ్చిందని పలువురు తల్లిదండ్రులు వాపోయారు. పండుగ పూట ధరలను నియంత్రించాలని, సామాన్యులపై భారం పడకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.